క్లుప్తంగా

వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

రాజానగరం: ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలతో వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల కారణంగా సంభవించే వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రామభాస్కర్ అన్నారు. గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై వారిని చైతన్యపరచాలని వైద్య సిబ్బందికి నిర్దేశించారు. ఏ ప్రాంతంలోనైనా ఎటువంటి అనారోగ్య పరిస్థితులతో ప్రజలు బాధపడుతున్నా వెంటనే మెరుగైన వైద్య సేవలు అందించడంలో చురుకైన పాత్ర వహించాలన్నారు. రాజానగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కూడా వచ్చే రోగులకు 24 గంటల పాటు వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు చేశామన్నారు.

12న బీపీహెచ్‌యూ భవనానికి శంకుస్థాపన

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా పీహెచ్‌సీ ప్రాంగణంలో రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (బీపీహెచ్‌యూ) భవన నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేయనున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి.

సూర్యదేవుని సన్నిధిలో ప్రత్యేక పూజలు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధిచెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజీటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు స్వామి వారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు చేశారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

వర్షంతో పంటలకు జీవం

రంగంపేట: మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షంతో పంటలు జీవం పోసుకున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మొదటిలో వర్షాలు కురవడంతో రైతుల ఎంతో ఉత్సాహంగా సాగు పనులు ప్రారంభించారు. కొందరు రైతులు బోర్ల కింద నాట్లు వేయగా, మరికొందరు వెదజల్లారు. కొన్నిగ్రామాల్లో రైతులు అందుబాటులో ఉన్న నీటి వసతులను వినియోగించుకుని వరి నాట్లు వేశారు. కాగా నాట్లు వేసినప్పటి నుంచి వరుణుడు ముఖం చాటేయడంతో బోర్లు వద్ద వేసిన వరి నాట్లు మినహా మిగతా ప్రాంతాల్లో వేసిన వరి పొలాలకు నీరందక పంట ఎండిపోయి బీడు భూములుగా మారాయి. ఎత్తిపోతల పథకాల నుంచి కూడా సాగునీరు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా దక్కవని ఆవేదన చెందుతున్నారు. శనివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురవడంతో పంటలకు జీవం వచ్చినట్లైంది. ఈ నెలలో వర్షాలు సమృద్ధిగా పడితే పెట్టుబడులతో గట్టెక్కవచ్చునని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కోరుకొండ (రాజానగరం): నిడిగట్ల వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో 60 ఏళ్ల వృద్ధుడు మృతిచెందాడు. రోడ్డుపై నడిచి వెళుతున్న అతడిని వెనుకనుంచి ద్విచక్ర వాహనం వేగంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. బైక్‌పై వెళ్తున్న వ్యక్తికీ గాయాలయ్యాయి. అతడిని చికిత్స కోసం రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడితో పాటు, క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై నాగరాజు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

108 వాహనంలో మహిళ ప్రసవం



అంబులెన్స్‌లో జన్మించిన బిడ్డతో వైద్య సిబ్బంది

కోరుకొండ (రాజానగరం): కోరుకొండ మండలం పశ్చిమ గానుగూడేనికి చెందిన ఓ మహిళ 108 వాహనంలోనే ఆదివారం ఓ బిడ్డకు జన్మనిచ్చింది. తొలిసారి గర్భవతి అయినప్పటి నుంచి బూసి భవానీ కోరుకొండ ప్రభుత్వాస్పత్రిలోనే వైద్య సేవలు పొందుతూ వచ్చింది. ఈ క్రమంలో ఆమెకు ఆదివారం ఉదయం పురిటి నొప్పులు ప్రారంభమవడంతో, కుటుంబ సభ్యులు కోరుకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడ సిబ్బంది రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లమని చెప్పడంతో.. 108 వాహనంలో ఆమెను తీసుకుని బయలుదేరారు. గాడాల సమీపంలోకి వచ్చేసరికి ప్రసవ వేదన ఎక్కువైంది. ఆ వాహనంలో ఉన్న ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) కల్యాణి సూచన మేరకు వాహనాన్ని రోడ్డు పక్కన ఆపారు. ఆ వాహనంలోనే ఆమెకు సుఖ ప్రసవం జరిగి, మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం తల్లీబిడ్డలను రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. ఇద్దరూ క్షేమంగానే ఉన్నారంటూ 108 సిబ్బందికి ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గట్టు జారి పోతా ఉంది

- అనేక గ్రామాలకు పొంచి ఉన్న పెను ముప్పు
- కోతకు గురవుతున్న గోదావరి ఏటిగట్టు
- అరకొర పనులతో మమ అనిపిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం



బొబ్బిల్లంక వద్ద ఏటిగట్టును ఆనుకుని గోదావరి వరద



బొబ్బిల్లంక వద్ద కోతకు గురవుతున్న ఏటిగట్టు

సీతానగరం: అఖండ గోదావరి వరద నుంచి కాపాడే ఏటిగట్టుకు పెను ప్రమాదం పొంచి ఉంది. గోదావరి వరద నుంచి ఏటిగట్టుకు రక్షణ కరవైంది. వరదతో ఏటిగట్టు కోతకు గురై బలహీనపడుతోంది. అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంక్(ఏజీఎల్‌బీ) అధికారులు మాత్రం అరకొర పనులతో మమ అనిపిస్తున్నారు. కొన్నేళ్లుగా వరద వల్ల ఏటిగట్టు జారిపోయి బలహీనంగా ఉన్న ప్రదేశాల్లో ఇరిగేషన్, అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంక్ అధికారులు ఇసుక బస్తాలు వేసి చేతులు దులుపుకొనేవారు.

బలహీన పడిన ఏటిగట్టు

గోదావరి వరద నుంచి రక్షించే ఏటిగట్టు బొబ్బిల్లంక నుంచి పురుషోత్తపట్నం వరకుంది. కాటవరం ఇసుక ర్యాంపు సమీపంలో మునికూడలి వద్ద ఏటిగట్టు బలహీన పడింది. 2012లో ధవళేశ్వరం నుంచి కూలీలను రప్పించి, ఇసుక బస్తాలను ఏటిగట్టు అంచున వేశారు. ఏటిగట్టు నుంచి ఇంకా లంకభూమి ఉండటంతో ఎటువంటి ముప్పు వాటిల్లలేదు. సీతానగరం లంకూరు వద్ద ఏటిగట్టు బలహీన పడిందని ఇసుక బస్తాలు వేశారు. ఇప్పటి వరకు ఏటిగట్టును పట్టించుకున్న దాఖలాలు లేవు. గట్టును పటిష్టపర్చడానికి చర్యలూ తీసుకోలేదు. వరద ఉధృతంగా వస్తే ఏటిగట్టు వరకు ప్రవాహం చేరుతుంది. ఇలాగే వదిలేస్తే కొన్నేళ్లకు ఏటిగట్టు పూర్తిగా కోతకు గురయ్యే అవకాశం లేకపోలేదు.

పొంచి ఉన్న పెను ముప్పు

వరద నిత్యం ఏటిగట్టును ఆనుకుని ఉండేది జాలిమూడి, బొబ్బిల్లంక వద్ద మాత్రమే. ఏటిగట్టును ఆనుకుని ఉన్న లంకభూమి కోతకు గురైంది. గతేడాది కూటమి ప్రభుత్వం బొబ్బిల్లంక వద్ద కోతకు గురవుతున్న ఏటిగట్టు వద్ద రాళ్లు వేసి చేతులు దులుపుకొంది. ఈ ఏడాది వరద మొదలై నెల రోజులైంది. ఏటిగట్టు వద్ద కేవలం 115 మీటర్ల వరకు రాళ్లు వేస్తున్నారు. జాలిమూడి నుంచి బొబ్బిల్లంక వరకు ఏటిగట్టును అరకొర పనులతో సరిపెడుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో..

గోదావరి వరదతో 2023 జూలైలో జాలిమూడి వద్ద ఏటిగట్టుకు ప్రమాదం ఉందని గ్రహించిన అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా.. రక్షణ చర్యల్లో భాగంగా ఇసుక బస్తాలు వేయించారు. ఏటిగట్టును ఆనుకుని ఎర్త్ బాండ్స్ బలహీనంగా ఉండడంతో, వీటి మరమ్మతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.24 కోట్ల అంచనా వ్యయంతో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నుంచి నిధుల మంజూరుకు అభ్యర్థించారు. అప్పటి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. గతేడాది జూలై నెలాఖరున బొబ్బిల్లంక వద్ద గోదావరి వరదతో ఏటిగట్టు కోతకు గురవ్వడం మొదలైంది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నుంచి నిధుల కోసం స్థానిక కూటమి ఎమ్మెల్యే ముందస్తుగా ప్రయత్నించి ఉంటే, ఏటిగట్టు రక్షణ పనులు ప్రారంభమయ్యేవి.

గండి పడితే..

ఏటిగట్టుకు గండి పడితే సీతానగరం మండలంతో పాటు, గోకవరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లో కొన్ని గ్రామాలు, రాజమహేంద్రవరం రూరల్‌లో కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయి. వరద నీరు తిరిగి బొబ్బిల్లంక స్లూయిజ్ నుంచి గోదావరిలోకి వెళ్లాల్సి ఉంది. గండి పడితే నెల రోజుల కన్నా పైబడి నీరు వెళ్లడానికి సమయం పడుతుంది. దీంతో ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. అధిక సంఖ్యలో ప్రాణనష్టం కలగవచ్చు. జనావాసాలకూ ముంపు బెడద తప్పదు. జీవన విధనం అస్తవ్యస్తంగా మారుతుంది.

అరకొర పనులు

బొబ్బిల్లంక వద్ద నిత్యం ప్రవాహం ఉండటంతో ఏటిగట్టు కోతకు గురవుతుంది. జాలిమూడి నుంచి బొబ్బిల్లంక వరకు ఏటిగట్టు కోతకు గురవుతుంటే, బొబ్బిల్లంక వద్ద కేవం 115 మీటర్లు మాత్రమే పటిష్టపర్చేలా రూ.2.68 కోట్లతో ఏజీఎల్‌బీ అధికారులు పనులు చేపట్టారు. స్టోన్ రివిట్‌మెంట్, పిచ్చింగ్ ప్లాట్‌ఫామ్‌లు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నారు. కోతకు గురవుతున్న 1,385 మీటర్ల ఏటిగట్టుకు రక్షణ చర్యలు చేపట్టలేదు. వరద సమయంలో ఏటిగట్టును ఆనుకుని ఉన్న పురుషోత్తపట్నం, వంగలపూడి, రామచంద్రపురం, సింగవరం, సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ల, ఇనగంటివారిపేట, వెదుళ్లపల్లి, రాజంపేట, మునికూడలి, కాటవరం, జాలిమూడి, బొబ్బిల్లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమని ఉంటున్నారు.

ఏటిగట్టుకు ప్రమాదమే..



గోదావరి వరద ఉధృతంగా వస్తే ఏటిగట్టుకు ప్రమాదమే. జాలిమూడి నుంచి బొబ్బిల్లంక వరకు ఏటిగట్టు కోతకు గురైంది. జాలిమూడి వద్ద గతంలో ఇసుక బస్తాలు వేశారు. ఇప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. గోదావరి వరద వస్తే రాత్రుళ్లు నిద్ర ఉండడం లేదు. ఏసమయంలో ఏటిగట్టుకు గండి పడుతుందనే భయం కలుగుతుంది. బొబ్బిల్లంక వద్ద ఏడాది నుంచి కోతకు గురవుతున్న ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు. ఇప్పుడు అరకొర పనులు చేస్తున్నారు.

– రూపం ఏసోబు, బొబ్బిల్లంక

కొంత వరకే చేస్తున్నారు



ఏటిగట్టు కోతకు గురవుతున్న ప్రాంతం ఒకటిన్నర కిలోమీటర్లు పైగా ఉంటుంది. బొబ్బిల్లంక వద్ద కొద్దిమేర మాత్రమే పనులు చేస్తున్నారు. బండరాళ్లు తెచ్చి గోదావరిలోకి ఏటిగట్టు అంచు నుంచి విడుస్తున్నారు. పైకి బండరాళ్లు వచ్చే వరకు వేస్తున్నారు. మిగిలిన ఏటిగట్టు పటిష్టపర్చడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వరద ఉధృతంగా వస్తే ప్రమాదం అంచున ఉన్నట్లే. ఎక్కడ గండి పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

– మెల్లిమి రామచంద్రరావు, సర్పంచ్, బొబ్బిల్లంక

రూ.35 కోట్లతో అంచనాలు పంపాం



గోదావరి వరదకు కోతకు గురవుతున్న బొబ్బిల్లంక వద్ద 115 మీటర్లుకు రూ.2.68 కోట్లతో స్టోన్ రివిట్‌మెంట్, పిచ్చింగ్ ప్లాట్‌ఫామ్‌లు నిర్మించేలా పనులు చేపట్టాం. బొబ్బిల్లంక వద్ద ఏటిగట్టు కోతకు గురవుతుంది. రక్షణ చర్యల్లో భాగంగా పనులు చేపట్టాం. మిగిలిన 1,385 మీటర్లకు రూ.35 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన వెంటనే మిగిలిన ఏటిగట్టు పటిష్ట పనులు ప్రారంభిస్తాం.

– ఎ.శివప్రసాద్, ఏఈ, అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంక్

ఎక్కడ బాబూ అభివృద్ధి..?

- చేసిందే లేదు.. ఎక్కడ అడ్డుకున్నాం..
- కూటమి నాయకులపై విరుచుకుపడిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



రఘుదేవపురం రోడ్డులో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 16 నెలలైనా అభివృద్ధి ఎక్కడ చేశారు? ఎక్కడ అడ్డుకున్నాం? చేతనైతే రెండు కిలోమీటర్ల నాలుగు లేన్ల రోడ్డు వేసి చూపించాలంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులు సవాల్ విసిరారు. ఆదివారం రఘుదేవపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు వద్ద విలేకరుల సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో-కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోంద్రపు ముత్యాలు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అంబటి రాజు, మాజీ ఎంపీపీ పెండర్తి దేవదాసు తదితరులు కూటమి నాయకుల విమర్శలను తిప్పికొట్టారు. కన్వీనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా, అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నాలుగు లేన్ల రోడ్డు, 30 పడకల ఆస్పత్రి, రివర్స్ పంపింగ్ స్కీమ్‌లు తెచ్చారని గుర్తు చేశారు. 16 కిలోమీటర్ల మేర 66 అడుగుల నాలుగు లేన్ల రోడ్డు పూర్తి చేయగా, ఎన్నికల కోడ్‌తో రెండు కిలోమీటర్లు ఆగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 16 నెలలైందని, రెండు కిలోమీటర్లు రోడ్డు 30 అడుగులకు కుదించారని, శంకుస్థాపన పూర్తయిన 30 పడకల ఆస్పత్రి పనులు ఇప్పటికీ చేపట్టలేదని, రివర్స్ పంపింగ్ స్కీమ్ ఊసే లేదన్నారు. ఇదా కూటమి అభివృద్ధి అని దుయ్యబట్టారు. అభివృద్ధి అనేది మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వద్ద నేర్చుకోవాలని హితవు పలికారు. ముత్యాలు మాట్లాడుతూ, ప్రభుత్వాలు మారితే అభివృద్ధి పనులు కొనసాగుతాయని, 2014–19 మధ్య సీతానగరం హైస్కూల్లో క్రీడా వికాస కేంద్రం పునాదుల వరకు కట్టారని, దానిని జక్కంపూడి రాజా కొనసాగించి పూర్తి చేశారని గుర్తు చేశారు. అదేవిధంగా రెండు కిలోమీటర్ల నాలుగు లేన్ల రోడ్డును పూర్తి చేయాలనడం అభివృద్ధిని అడ్డుకున్నట్టా అని ప్రశ్నించారు. జల్‌జీవన్ ప్రాజెక్టు అటెక్కించారని, శ్రీసత్యసాయి వాటర్ ప్రాజెక్టు కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో.. ఐదు మండలాల్లో మూడు లక్షల మంది ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇదేనా అభివృద్ధి అని నిలదీశారు. ఎస్సీ సెల్ నేత రాజు మాట్లాడుతూ, రెండు కిలోమీటర్లు నాలుగు లేన్ల రోడ్డు వేస్తే వైఎస్సార్ సీపీ సహకరిస్తుందని, 30 అడుగుల రోడ్డు వేస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. మాజీ ఎంపీపీ దేవదాసు మాట్లాడుతూ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు గ్రామానికి రూ.పది లక్షలు ఇస్తానని చెప్పి కొబ్బరికాయలు కొట్టారని, రెండో ఏడాది వచ్చినా ఆ నిధులు ఏమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. 30 పడకల ఆస్పత్రి పనులు, బొబ్బిల్లంకలో పీహెచ్‌సీ పనులు, బొబ్బిల్లంక-ములకల్లంక బ్రిడ్జి పనులు ఎందుకు కొనసాగించడం లేదని ప్రశ్నించారు. రెండు కిలోమీటర్ల రోడ్డు విషయంలో రాజకీయ మైలేజీ కోసం వైఎస్సార్ సీపీ అడ్డుకోలేదని, నాలుగు లేన్ల రోడ్డు మండల ప్రజల ఆకాంక్ష అని, పార్టీలకతీతంగా ప్రజలు నిరసన తెలియజేస్తున్నారన్నారు. పోలీసుతో కేసులు పెట్టి, లాఠీలతో కొట్టి, బలప్రయోగం చేసి 30 అడుగుల రోడ్డు వేస్తే ప్రజల దృష్టిలో కూటమి నాయకులు చరిత్రహీనులుగా మిగిలిపోతారని స్పష్టం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ చేసి రోడ్డు వేయాలన్నారు. పార్టీ కో-కన్వీనర్ శ్రీహరిబాబు మాట్లాడుతూ, నిధులు లేవని రోడ్డును కుదించడం కాదని, కూటమి నాయకులు ఏకాభిప్రాయంతో నాలుగు లేన్ల రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు తాడేపల్లి వెంకట్రావు, వెన్నెల అప్పలనాయుడు, పార్టీ నాయకులు పిండి రాధాకృష్ణ, పైడి రాజు, పిచ్చుకల విజయ్‌కుమార్, అదికారి శ్రీను, తోరం పోశియ్య, ఈత వీరబాబు, కుచ్చెర్ల రాము తదితరులు పాల్గొన్నారు.

'గ్రాసిమ్'పై అసత్యాలు మానుకోవాలి

అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: గ్రాసిమ్ ఇండస్ట్రీస్‌పై ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఇకనైనా అసత్యాలు మానుకోవాలని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హితవు పలికారు. ఆదివారం ఆయన అనపర్తి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు హయాంలో రూ.900 కోట్లు ఉన్న ప్రాజెక్టును రూ.2700 కోట్లు బ్యాంకు రుణాలు ఇప్పించి కేపీఆర్ సంస్థ నుంచి భూములను గ్రాసింకు బదలాయించింది ఎవరో తెలియదా ? అని ప్రశ్నించారు. 2019లో దొంతమూరు గ్రామంలో అఖిలపక్ష సమావేశం పెడితే వారం రోజులు సమయం ఇస్తే అనుమతులు రద్దు చేయిస్తానని ప్రగల్భాలు పలికింది మర్చిపోయావా ? అని ఎద్దేవా చేశారు. ఆ ఉద్యమంలో వందల మంది అమాయకులు అరెస్టు అయ్యారని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఎప్పుడూ అరెస్టు కాలేదు కదా ఆయనపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. కేపీఆర్‌తో లాలూచి అయ్యావు కనుకే నీపై కేసులు, అరెస్టులు లేవని ఆరోపించారు. అమాయకులను ముందుకు తోసి నీవు మాత్రం వెనుక లాలూచి మంత్రాంగం నడిపావా ? అంటు ఎద్దేవా చేశారు. నీ క్రిమినల్ ఐడియాలు నా మీద ప్రయోగించాలని చూస్తున్నావు, నేనేమీ నమ్మిన వాళ్లని జామీనులు పెట్టించుకుని నట్టేట ముంచలేదు, బ్యాంకులకు రుణాలు ఎగ్గొట్టలేదని ఘాటుగా విమర్శించారు. ఇకనైనా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి వాస్తవాలు మాట్లాడితే మంచిదని, లేకపోతే ప్రజలు పట్టించుకోకుండా పోయే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు



ఆల్బెండజోల్ మాత్రలు

బిక్కవోలు: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 12న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో ఒక్కో ఏరియా ఆసుపత్రి, ఒక సీహెచ్‌సీలు, 7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, 79 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల ద్వారా 32 వేల మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నారు. ఈ మేరకు అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పిల్లలు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు జి.విజయలక్ష్మి సూచించారు. ఒకటి నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు సగం మాత్ర, ఆరేళ్ల పైబడిన వారు ఒక మాత్ర వేసుకోలన్నారు. మాత్రలను మధ్యాహ్నం భోజన తరువాత చేతులు శుభ్రంగా కడుక్కుని తీసుకోలని, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఈ మాత్రలు వాడకూదని తెలిపారు. కడుపులో నులిపురుగులు ఎక్కువగా ఉన్న విద్యార్థులకు వాంతులు, తలనొప్పి, కడుపునొప్పి వంటి ప్రతికూల పరిస్థితులు కనపడవచ్చన్నారు. ఈ లక్షణాలు తాత్కాలికమే అని, ఎటువంటి భయాదోళనకు గురికావద్దని సూచించారు.

వినాయక చవితికి రాట ముహూర్తం



కొంకుదురులో పందిరి రాట వేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు మార్కెట్ సెంటర్‌లో గణపతి నవరాత్ర ఉత్సవాలకు ఆదివారం రాట ముహూర్తం నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ చిన్నం వీరభద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి చవితి ఉత్సవాలకు పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా వీరభద్రారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది 64వ ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామానికి చెందిన సత్తి లక్ష్మీ నారాయణరెడ్డి, సత్య ప్రియం దంపతులు కంకణదారులు వ్యహరించనున్నారు. ప్రతిరోజూ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలోని ఉత్సవ కమిటీ సభ్యులు ద్వారంపూడి వెంకటరెడ్డి, కర్రి రామారెడ్డి, మల్లిడి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: గ్రామంలోని ప్రాచీన శ్రీలక్ష్మీగణపతి ఆలయం వద్ద వినాయక చవితి ఉత్సవాలకు ఆదివారం రాటముహూర్తం చేశారు. ఈ నెల 27 నుంచి నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేసి పందిరి రాట వేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది ఆలయం వద్ద గణపతి నవరాత్రులను అంగరంగా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఆకెళ్ల రామలింగ భాస్కర్, తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



సీతానగరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం మండల పరిషత్ కార్యాలయం నుంచి హర్ ఘర్ తిరంగా ర్యాలీని అధికారులు, ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎంపీడీఓ ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎస్సై డి.రామ్‌కుమార్ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ నాలుగు బొమ్మల సెంటర్ మీదుగా బస్టాండ్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, స్వాతంత్య్ర స్ఫూర్తిని, దేశభక్తిని పెంపొందించడం కోసమే ఈ కార్యక్రమన్నారు. జాతీయ జెండా ప్రాముఖ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కేవీఎస్ఎస్ మూర్తి, డిప్యూటీ తహసీల్దార్ సునీత, ఏఓ సుబ్రహ్మణ్యం, పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు, డాక్టర్ సత్యం రమేష్‌బాబు, ఏపీఓ సత్యవతి, ఏపీఎం జీలాని, ఉద్యోగులు గోపాల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుల నియామకం

బిక్కవోలు: మండలంలోని ఆరు గ్రామాలకు ఆదివారం సొసైటీ అధ్యక్షులను నియమించారు. బిక్కవోలు సొసైటీ అధ్యక్షుడిగా పాలచర్ల వెంకట శివ ప్రసాద్‌చౌదరి, బలభద్రపురం సొసైటీ అధ్యక్షుడిగా నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, కొమరిపాలెం సొసైటీ అధ్యక్షుడిగా ద్వారంపూడి వెంకట రెడ్డి, పందలపాక సొసైటీ అధ్యక్షుడిగా పడాల సూర్యనారాయణరెడ్డి, కొంకుదురు సొసైటీ అధ్యక్షుడిగా చింతా శ్రీనివాసరెడ్డి, ఊలపల్లి సొసైటీ అధ్యక్షురాలిగా తోండాపు నీరజ స్వాతి, మెళ్లూరు సొసైటీ అధ్యక్షుడిగా చావ్వకుల వేణుగోపాల కృష్ణ నియమితులయ్యారు. నూతన అధ్యక్షులకు పలువురు అభినందనలు తెలిపారు.

సేంద్రియ ఎరువులతో మంచి దిగుబడి



సేంద్రియ ఎరువుల వినియోగంపై గానుగూడెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజానగరం: వ్యవసాయంలో సేంద్రియ ఎరువులను వాడటం ద్వారా ఖర్చును తగ్గించడంతో పాటు, ఆరోగ్యవంతమైన మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కల్యాణ్ సూర్యకుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి, వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. సేంద్రియ ద్రావణాలైన పంచగవ్య, చేపబెల్లం, ద్రావణాల తయారీ, వినియోగం, ప్రయోజనాలపై రైతులకు అవగాహన కలిగించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సిఫార్సు మేరకు వినియోగించాలని, సేంద్రియ ఎరువులతో సాగు చేయడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. వరి సాగులో చేప బెల్లం ద్రావణాన్ని పొట్ట దశలోను, నాట్లు వేసిన 30 రోజుల తరువాత పంచగవ్య ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. అలాగే రైతులకు లింగాకర్షక బుట్టలు, వాటి ఉపయోగాలపై అవగాహన కలిగిస్తూ, క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. వీటి ద్వారా వరి పంటలో కాండం తొలుచు పురుగు, రెక్కల పురుగుల ఉధృతిని తెలుసుకోవడంతో పాటు, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఎకరాకు నాలుగు లేదా ఐదు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు.